ఆధ్యాత్మిక అంతర్జాల పత్రిక

# శ్రీసన్నిధానం

సంపుటి 02 సంచిక 04 ఏప్రిల్ 2023



# శ్రీసన్నిధానం

srisannidhanam.org

## ఇందులో


3. సంపాదకీయం

4. నెలవారి పంచాంగం

5. మన దేవాలయాలు

6. రామానుజ సుధామాధురి
   విరోధి పరిహరణ

7. రక్షించకున్ననూ రక్షకులు ఎవరూ

9. శ్రీపతిస్తుతి

11. భాగవతంలో భగవంతుని కథలు

13. జ్యోతిర్విజ్ఞానమ్

14. బాల విజ్ఞానం

16. ఆధ్యాత్మిక వార్తలు



**సంపాదక మండలి**

వొద్దిపర్తి రామచంద్రమూర్తి చీఫ్ ఎడిటర్

సముద్రాల శారద వొపీనియన్ ఎడిటర్

డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

**గౌరవ సంపాదకులు**

శ్రీమాన్ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

శ్రీమాన్ అమరవాది వెంకటనర్సింహా చార్యులు




## ముఖచిత్ర పరిచయం

సర్వకామ ప్రదమైన అక్షయ తృతీయ వ్రతం. వైశాఖ శుద్ధ తదియ నాడు చేసే ఏకార్యమైనా అక్షయమౌతుంది. అక్షయుడైన విష్ణువును పూజించాలని పురాణప్రవచనం. శ్రీ నారద పురాణం, మత్స్య పురాణం లో దీని మహత్తు వివరించబడింది. ఏపని చేసినా అక్షయమౌతుందన్న నమ్మకం స్వర్ణ సేకరణకు మొగ్గుచూపేలా చేసింది. వాస్తవానికి వస్తే షోడష పూజలు చేసిన విధంగా 16 మినుపగుండ్ల ఎత్తు బంగారం విప్రునకు దానం ఇవ్వాలని, తద్వారా వచ్చేఫలము అక్షయమౌతుంది. మనకు ఉన్నదానిలో శ్రీమహావిష్ణువును ఆరాధిస్తే ఇహాపరసుఖాలు లభ్యం అవుతాయి. లక్ష్మీదేవి కరుణిస్తుందన్న అర్ధంకూడా వస్తుంది. అందుకే సింహాద్రి అప్పన్నకు చందనోత్సవం చేస్తారు. విశేషమేమిటంటే అక్షయ తృతీయతో పాటుగా వైశాఖ, జ్యేష్ఠ, ఆషాఢ పౌర్ణమి రోజుల్లో సమర్పించిన చందనాన్ని తెల్లవారితే అక్షయ తృతీయ అనగా, అర్ధరాత్రి బంగారు బొరుగులతో స్వామివారి నుంచి సేకరించి, మరునాడు భక్తులకు ప్రసాదంగా ఇస్తారు. ఈ మహాప్రసాదం, స్వామి వారి దర్శనంకోసం సింహాచలానికి భక్తులు బారులు తీరుతారు. అర్ధం పరమార్ధం వివరించే ఈ పండుగ ప్రాశస్త్యాన్ని రంగరించి అందించిన చందంగా శ్రీసన్నిధానం పాఠకుల ప్రయోజనం కోసం చిత్రకారుని కుంచెనుంచి జాలు వారింది.


**PUBLISHED BY :** డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్



చిరునామా: ఇ.నెం 10-2-225, విద్యానగర్ కరీంనగర్ ,తెలంగాణా - 505001 ఫోన్ : 878 2253323 ; 9502583323;



నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

## సంపాదకీయం

# సంప్రదాయ సంస్కరణల వైపు...!



స్వతంత్ర భారతదేశం ఆవిర్భవించినప్పటి నుంచి పాలకులు చేస్తున్న చట్టాలు, శాసనాలు ఎంతవరకు దేశ ప్రజలకు ప్రయోజనకరంగా ఉన్నాయన్న ప్రశ్న మేధావులలో ఉద్భవించినా అది పెదవి దాటి బయటకు రాని క్షణాలే ఎక్కువ. దేశంలో అన్ని ప్రాంతాలు అంతర్భాగం అయినా ఒక్కోప్రాంతానికి ఒక్కోరకంగా చట్టాలు, శాసనాలు చేశారు. ఇటీవలి కాలంలో పాలకులు అలాంటి వాటిని సంస్కరించే పని చేపట్టారు. అలా ఒక్కోటి క్రమంగా చేయడం ప్రారంభించారు. బూజుపట్టిన ఆలోచనలను పునరాలోచించి సంస్కరణకు నాంది పలుకుతున్నారు. ఆర్టికల్ 370 కింద ఏర్పాటు చేసిన వెసులు బాటును రద్దుచేసి భారత దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఒకే రాజ్యాంగాన్ని వర్తింపజేశారు. అయితే ప్రస్తుతం వివిధ రాష్ట్రాలలోని ప్రభుత్వాలు సరికొత్త ఆలోచనలతో ముందుకు వస్తున్నారు. ప్రజా ప్రయోజనాలు పక్కనపెట్టి రాజకీయ ప్రయోజనాలకు బాటలు వేస్తున్నారు. మతం మారిన వారికి రిజర్వేషన్లు వర్తించవని కోర్టులు పలు సందర్భాలలో తీర్పులు చెప్పినా వాటి విషయాలను పక్కన పెట్టి మతం మార్చిన వారికి కూడా రిజర్వేషన్లు కల్పించాలని భావిస్తున్నారు. ఆ దిశగా సవరణలు చేసిన సరికొత్త ప్రతిపాదనలు తమ రాష్ట్రాలలో అమలుచేయడానికి కేంద్రంముందు పెడుతున్నాయి. ఇలాంటి సంఘటనలు గతంలో జరిగినా వాటిని తిప్పి పంపిన ఉదంతాలు ఉన్నాయి. హిందూ సమైక్యతను దెబ్బతీసి మతమార్పులకు బహిరంగంగా ప్రలోభపెట్టేవారికి ఒక రకంగా వత్తాసు పలుకుతున్నట్లే! దేవాలయాలలో అన్యమతస్థులను ఉద్యోగులుగా నియమించడం లాంటి పనులు దొడ్డిదారిన జరుగుతున్నాయన్నది వాస్తవం. ఇప్పటికే పనిచేస్తున్నవారిని పక్కనపెట్టి ఇలాంటి కొత్తనియామకాలు ఉండవని చెబుతున్నారు. ఏది ఏమైనా అంతా కంటితుడుపు వ్యవహారాలే. కంటగింపు సంగతులే! ఒకవైపు భారతీయ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ దిశగా ప్రయత్నాలు చేస్తున్నవేళ!! మరోవైపు కుహనాశక్తులు చిల్లులు చేసేప్రయత్నాలు చేస్తున్నాయి. మనకు ఇది తప్పూ దీనిని ప్రతిఘటించగలమని అనుకున్నవారు ఎవ్వరూ కోర్టు మెట్లు ఎక్కేప్రయత్నం చేయరు. నిష్కలంకులు, ధర్మ పరాయణులు అధికారం పీఠంపై ఉన్న సమయంలో కుహనా యుక్తులు, ఎత్తులు చెల్లవు. కానీ వాస్తవాన్ని నిలదీసే ధైర్యం సంప్రదాయ సమాజంలో వచ్చినప్పడుగానీ ఆధునికత పేరుతో, సెక్యులర్‌ముసుగుతో, స్వార్థంతో పబ్బం గడుపుతున్నవారి ఆటలు కట్టవు.

కేంద్రప్రభుత్వ ఇచ్చిన తాజా మహజరు పరిశీలిస్తే తెలుగుతనానికి పెద్దపీట వేసినచందం కనిపిస్తుంది. పండగల వెనుక పరమార్థం దాగి ఉందన్న విషయం మనకు తెలిసినదే! అయితే లోతుగా పరిశీలించిన తరువాతే వాస్తవం వెలుగు చూస్తుంది. తిథులలో తొలిగా వచ్చేది పాడ్యమి. తొలిమాసం చైత్రానిది కాగా వాతావరణ మార్పులకు అనుగుణంగా ఋతువులు పూర్వీకులు (ఋషులు) ఏర్పాటు చేశారు. ఇలా తిథులు, వారాలు, 27 నక్షత్రాలు, 27 కరణాలు, యోగాలుగా చెప్పుకొచ్చారు. బ్రహ్మసృష్టి ప్రారంభించింది చైత్ర శుద్ధ పాడ్యమినాడే! ఈ విషయం బ్రహ్మపురాణంలో స్పష్టం చేశారు. ఇలా యుగానికి మొదటిరోజు యుగాది అయింది అన్నది సుస్పష్టం, తెలుగు సంవత్సరాదికి ఉన్న ప్రత్యేకత అదే! ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది, తెలుగు సంవత్సరాదినే హిందూ సంవత్సరాదిగా కేంద్రం అధికారికంగా ప్రకటించింది. జాతీయ సెలవుదినంగా ప్రకటించింది. యుగం ప్రారంభం నుంచి యుగాది పర్వదినంనాడు ఎన్నో అద్భుత సంఘటనలు జరిగాయి. వాస్తవానికి వస్తే వారం సంగతి సరే కానీ తిథులు, నక్షత్రాలు ఇత్యాదివి అన్నీ క్యాలెండర్‌కే పరిమితం అయ్యాయి. క్రమంగా పుట్టినరోజును సైతం తేదీల వారీగా జరుపుకుంటున్నాం! జన్మనక్షత్రం మరచిపోతున్నాం! దీనిలో ఎంత ఔచిత్యం ఉంది?! ఆలోచించవలసివుంది.

– చీఫ్ ఎడిటర్

# నెలవారి పంచాంగమ్ ఏప్రిల్

ముందు మాట : ఘాత వారమందు పనికి వచ్చునవి : వివాహము, ఉపనయనము, పట్టాభిషేకము, సీమంతము, జాతకర్మ, పుంసవనము చేయుటకు దోషము లేదు. ఘాతవారమందు చేయగూడనివి: గృహ ప్రవేశము, వ్యాపారారంభము, యాత్రలు, బావిత్రవ్వుట, ప్రయాణం చేయకూడదు.

**చైత్ర మాసం 22-03-2023 శోభకృత్ ఉగాది తో ప్రారంభమై 20-04-2023 వరకు. తదుపరి వైశాఖ మాసం.**

చైత్ర శు॥ నవమి 30-03-2023 గురువారము నుండి వైశాఖ శు॥ సప్తమి 27-04-2023 గురువారము వరకు గురు మౌఢ్యము. వైశాఖ శు॥ విదియ 22-04-2023 శనివారం నుండి గంగ పుష్కర ఆరంభము. వివాహాది శుభ ముహూర్తములు మౌఢ్యమి ఉన్నందున ఏప్రిల్ నెలలో ముహుర్తములు లేవు. 31-03-2023 నుండి 13-04-2023 రేవతి కార్తి, 14-04-2023 నుండి 27-04-2023 అశ్విని కార్తి, 28-04-2023 నుండి భరణి కార్తి. **పండుగలు :** 01-04-2023 కామద సర్వేషాం ఏకాదశి, 02-04-2023 వామన ద్వాదశి, 04-04-2023 మహావీర జయంతి, 05-04-2023 ఒంటిమిట్ట శ్రీ సీతారామ కళ్యాణం, 06-04-2023 హనుమద్విజయోత్సవం 09-04-2023 సంకష్టహర చతుర్థి, 14-04-2023 మేష సంక్రమణం, తమిళ సంవత్సరాది, 16-04-2023 వరూధిని సర్వేషాం ఏకాదశి, 18-04-2023 మాస శివరాత్రి, 19-04-2023 పితృ తర్పణం, 20-04-2023 అమావాస్య, 22-04-2023 పరశురామ జయంతి, 23-04-2023 అక్షయ తృతీయ, సింహాద్రి చందనోత్సవం, 25-04-2023 జగద్గురు శంకరాచార్య జయంతి, జగద్గురు రామానుజాచార్య జయంతి, 27-04-2023 గురు మౌఢ్యమి నివృత్తి


**శ్రీ శోభాకృత్ నామ రాశుల ఆదాయ వ్యయాలు**

| | ఆదాయం | | వ్యయం | రాజ్యపూజ్య | | రాజవమానం |
|---|---|---|---|---|---|---|
| మేషం | 5 | - | 5 | 3 | - | 1 |
| వృషభం | 14 | - | 11 | 6 | - | 1 |
| మిథునం | 2 | - | 11 | 2 | - | 4 |
| కర్కాటకం | 11 | - | 8 | 5 | - | 4 |
| సింహం | 14 | - | 2 | 1 | - | 7 |
| కన్య | 2 | - | 11 | 4 | - | 7 |
| తుల | 14 | - | 11 | 7 | - | 7 |
| వృచికం | 5 | - | 5 | 3 | - | 3 |
| ధనుస్సు | 8 | - | 11 | 6 | - | 6 |
| మకరం | 11 | - | 5 | 3 | - | 1 |
| కుంభం | 11 | - | 5 | 5 | - | 6 |
| మీనం | 8 | - | 11 | 8 | - | 8 |

**రాశి ఫలాలు**



మేషం: ఈ నెల అనుకూలంగా లేదు. వృత్తివ్యాపారాలు అంతగారాణించవు. ఆర్థికంగా ఇబ్బందులు. అధిక ధనవ్యయం, ఋణాలు చేయ వలసివచ్చును. ఆరోగ్యం జాగ్రత్త వహించాలి.



వృషభం: ఈనెల మిశ్రమ ఫలితములు వచ్చును. చేయు వృత్తివ్యాపారాలు అంతంత మాత్రమే సాగును. ఆరోగ్యభంగాలు తప్పవు. ఆదాయం నకు మించిన ఖర్చులు చేయుదురు. కార్యాలు మధ్యలో నిలిచిపోవును.



మిథునం: ఈనెల అనుకూలంగా ఉన్నందువల్ల అన్ని రంగాలవారికి చేయువృత్తి వ్యాపారాలందు రాణింపు. ఆదాయం బాగుండును. ఆరోగ్యం బాగుంటుంది. ధైర్యంగా ముందుకు పోగలరు. ఏ విషయాలందు ఉద్రేకంగా ఉండరాదు.



కర్కాటకం: ఈనెలయందు అనుకూలంగా ఉన్నందువల్ల అన్నిరంగాలవారికి చేయు వృత్తివ్యాపారాలందు రాణింపు, ఆదాయం బాగుండును. ప్రతివిషయంలో మీఆధిక్యత కొనసాగును. కొంత జాగ్రత్తగా ఉండాలి.



సింహం: ఈనెల అనుకూలం ఉన్నందున అన్నిరంగాల వారికి చేయువృత్తి వ్యాపారాలందు రాణింపు ఉండును. ఆరోగ్యం బాగుండును. ఆదాయం నకు లోటుండదు. ధైర్యంగా, సంతోషంతో ఉంటారు. ప్రయాణాలు కలిసి వచ్చును.



కన్య: ఈ నెల అనుకూలంగా లేదు. చేయు వ్యాపారాదులందు అనుకూలత ఉండదు. ఒత్తిడి ఉండును. అకాలభోజనాలు, పనులందు ఆటంకాలు ఉద్యోగులకు బదిలీలు, గృహమార్పులు, వాహనమార్పులు. **(మిగతా 10 వ పేజీలో)**

# అరుదైన భగవద్ రామానుజ సన్నిధి




## మన దేవాలయాలు

సేకరణ - శేషం సీతా రామా చార్యులు

అపర భద్రాద్రిగా పేరుగాంచిన దివ్య క్షేత్రం సీతా రామచంద్ర నిలయమైన ఇల్లెందకుంట. పాంచరాత్ర ఆగమ విధానం ఆరాధనలతో వైభవమైన ఉత్సవాలతో అలరారుతున్న పుణ్యక్షేత్రం. పల్లెల నడుమ వెలసిన క్షేత్రం కనుక సహజ సస్య క్షేత్రాలతో శోభిల్లుతుంది. జమ్మికుంట గ్రామానికి 5 కిలోమీటర్ల దూరంలో కరీంనగర్ 49 కిలోమీటర్ల దూరంలో ఉంది. శ్రీరామనవమి ఉత్సవాలలో లక్షలాది భక్తులు పాల్గొంటారు. సమీప శివాలయంలో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి. పూర్వం దండకారణ్యంగా ఉన్న ఈ ప్రదేశంలో శ్రీరాముడు అరణ్యావాసం చేసినప్పుడు (ఇందువల్లి) ఇల్లంద వృక్ష గింజలతో శ్రీరాముడు తర్పణాలు వదిలాడని స్థల పురాణం. అలసిన స్వామి ఈ వృక్షం కింద సేద తీరాడని స్థల చరిత్ర.ఇల్లెందు వృక్షాలకునిలయమైనది కనుక ఇల్లందకుంటగా పేరుగాంచింది. దేవాలయంలోని శాసనాలు క్షేత్ర ప్రాచీనతను వెల్లడిస్తాయి. స్వయం వ్యక్తం అయిన స్వామి మూర్తి ఉత్తర ముఖంగా శయ్యా ముద్ర లో ఉంటారు. ఇక్కడి పుష్కరణిని కూడా అతి పవిత్రమైనదిగా భావిస్తారు. వైద్యం గురించి, విద్య గురించి, స్వామిని ప్రార్థిస్తే కోర్కెలు తీరుతాయని భక్తులు విశ్వాసంతో ముక్కులు తీర్చుకుంటారు. అందుకే వైద్య రామునిగా. విద్యా రామునిగా కీర్తిస్తారు. శ్రీమన్నారాయణ రామానుజ పెద్ద జీయర్ స్వామి వారు నిర్మించిన రామ స్థూపం కూడా ఉంది. సనాతనము భక్తజన సందోహముతో నిత్య ఆరాధనలతో ఉత్సవాలతో విలసిల్లే ఈ క్షేత్రంలో శ్రీ రామానుజ సన్నిధి దేవాలయం ప్రత్యేకంగా ఉంది. **ఇల్లందకుంట భగవద్ రామానుజుల చరిత్ర** : పూర్వం సీతారాముల బ్రహ్మోత్సవములు సమీపిస్తున్న సమయం లో ఒక అర్చక స్వామికి కొన్ని దినముల నుండి ప్రతి రోజు కలలో ఒక బంగారు వర్ణములో ఉన్న పుట్ట, పాము కనిపిస్తూ ఉండేవట. అట్లా ప్రతీ దినము కనిపిస్తున్నది అంటే




ఉత్సవాలకు పుట్టమన్ను ఈ పుట్టనుండే మట్టిని సేకరించమని ఆజ్ఞ కావచ్చునేమో అని తలంచి, పుట్టమన్నును సేకరించటం కోసం ఆ ప్రాంతంలో ఉన్న ఆ దివ్యమైన పుట్ట దగ్గరికి వెళ్లి పూజలు జరిపి, ప్రార్థించి పుట్ట నుండి మన్నును తవ్వి తీసుకునే సమయంలో పుట్టలో కదలికలు కలిగాయి పాములున్నాయేమో అని తలచిన అర్చకులు పుట్టనుండి దూరము కదిలి పెరుమాళ్లను ప్రార్థించ సాగారు. అప్పుడు పుట్టనుండి గోధుమ వర్ణంలో ఉన్న ఒక దివ్య సర్పం బయటకి వెళ్లిపోయింది. ఆ సర్పం కదలికలకి పుట్ట చెదిరి అందులోని ఒక శిల కనిపించింది! ఏమిటా అని పూర్తిగా మన్ను తొలగించి చూస్తే, అద్భుతమైన భగవద్ రామానుజల దివ్య మంగళ విగ్రహం సాక్షాత్కరించింది.. అర్చకులు ఎంతో ఆశ్చర్యానికి ఆనందానికి లోనై అంతా వారి పూర్వ జన్మ సుకృతం అని భావించి ఎంతో ఆనందం గా భగవద్ రామానుజుల సన్నిధిని తడకలతో, మట్టితో నిర్మించి పూజా విధానాలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తూ ఉండే వారు. ఆ తరువాత కాలానుగుణంగా కొన్ని తరాలు మారినాక ఆలయ నిర్మాణము జరిగింది.


కొన్ని సంవత్సరములకు ముందు వరకు ఈ భగవద్ రామానుజుల ఆలయం లో పెద్ద ఘట సర్పం తిరుగుతూ ఉండేది.. దానిని రామానుజుల ప్రతిరూపం గా అందరు భావించేవారట. అయితే ఆ సర్పం కొని దినముల క్రితం కొంత మంది మాములు సర్పం అని భావించి పట్టుకుందామని చూడటం చేత. అప్పటినుండి ఆ సర్పం అదృశ్య రూపంలో ఉండి కనిపించటం లేదని.. ఇప్పటికి స్వామి కి ఆరాధన జరుపుతుంటే అప్పుడప్పుడు మూర్తి నుండి సర్పం బుస కొడుతున్న శబ్దం వినిపిస్తూ ఉంటుంది అని అర్చకులు చెప్తుంటారు..

ఈ సన్నిధిలోనే పూర్వం నుండి రక్షణ నిమిత్తం సీతారాముల స్వయం వ్యక్త ఉత్సవ మూర్తులు సన్నిధానమై వేంచేసి ఉంటారు. గొప్ప మహిమలు గల సీతా రామచంద్ర మూర్తి యొక్క శ్రీ రామానుజాచార్యుల యొక్క ఇరు దేవాలయాలను ఎందరో భక్తులు దర్శించుకుని తరిస్తారు.

# శ్రీరామానుజ సుధామాధురి

## విరోధి పరిహారణ

కర్తవ్యపాలనలో ధర్మవర్తనలో ఆధ్యాత్మిక సాధనలో విరోధి పరిహారం జరిగినప్పుడే అవి సక్రమంగా సాగుతాయి. ఫలవంతం అవుతాయి. శ్రీ సాంప్రదాయంలో భగవత్ ప్రాప్తి సాధనకు విరోధి పరిహరణ ప్రధానమైనది. అనగా కార్య సాధనలోని అడ్డంకులను తెలుసుకొని తొలగించటం. లౌకిక జీవనంలో కూడా అడ్డంకులను తొలగించుకుంటూ సాగినప్పుడే లక్ష్యాన్ని సాధించడం సుగమము అవుతుంది. సమాజ హితం కోసం మన ఆచార్యులు పెద్దలు చేసిన కృషిని శ్లాఘించడం ఎవరికి సాధ్యం! ఆ మార్గంలో వారు ప్రాణాపాయ స్థితిని ఎదుర్కొన్న సంఘటనలు కూడా మనం పూర్వాచార్యుల చరిత్రల్లో గమనించవచ్చు. సిద్ధాంత స్థాపనలో, పరిరక్షణలో శ్రీ భగవత్ రామానుజాచార్యులు ఎదుర్కొన్న అడ్డంకులు, వాటిని పరిష్కరించిన విధానము ఆశ్చర్యచకితులను గావిస్తుంది. సంఘాన్ని సంస్కరించిన విధం, సమాజ ఉజ్జీవనానికి వారనుసరించిన విధానం ఎంతో గొప్పవి.



ప్రపన్న జీవన మార్గంలో ఎదుర్కొనే విరోధాలను గురించి అడగగా శిష్యులైన వంగి పురత్తు నంబికి జగదాచార్యులు ఉపదేశించారు. వారనుగ్రహించిన 83 అవరోధములను గురించి "విరోధి పరిహారంగళ్" అని పేరు గల గ్రంథాన్ని ద్రావిడ భాషలో రచించారు. గొప్ప ఆచార్య నిష్ఠ గల వీరిని పూర్వాచార్యులు "ఆప్తతమర్" అని కీర్తించారు. శ్రీ పిళ్ళ లోకాచార్యులు కూడా సాంప్రదాయ గ్రంథాలైన అష్టాదశ రహస్యాలలో "అర్థ పంచకం"లో కూడా విరోధిస్వరూపాన్ని తెలిపారు.

"శ్రేయాంసి బహు విఘ్నాని భవంతి మహాతామపి" అని పెద్దల సూక్తి పండిన వృక్షానికే రాతి దెబ్బలని లౌకిక సామెత కూడా ఉంది ఇది సర్వత్ర అన్ని యుగాల్లోనూ కనిపించేదే! అడ్డంకులను తొలగించుకునే ధైర్యం,నిర్ణయ శక్తి కలగటానికి అనుసరించ తగిన రెండు మార్గాలను పెద్దలు చెప్తారు. ఒకటి పెద్దల ఆచార్యుల శ్రీ సూక్తులను వినటం. రెండవది అన్ని విరోధాలు పరిహరించి లోక కళ్యాణానికి కృషిచేసిన మహనీయుల చరిత్ర వైభవాలను తెలుసుకోవటం.


సాక్షాత్ ఆదిశేషాంశ సంభూతులై అవతరించిననూ సమస్త జనుల ఉద్ధరణలో జగదాచార్యులు ఎదుర్కొన్న అడ్డంకులను గురించి వారి చరిత్ర వైభవంలో మనం తెలుసుకోవచ్చును. ఆదిశేషులు అంటే నిత్య సూరులలో, శ్రియః పతి పరివారంలో ప్రధానులు. "నివాస శయ్యాసన పాదుకాంశుకోపధాన వర్షాతప వారణాదిభిః" అని భగవంతునికి అన్నిసేవలూ చేయగల శేష భూతులు. ఆదిశేషులు. ఆ ఆది శేషావతార మయిన శ్రీభగవద్రామానుజాచార్యులు వారి జీవనమార్గంలో అవరోధాలను ఎదుర్కొన్నారు దివ్యమంగళ స్వరూపులైన శ్రీరామానుజా చార్యుల శ్రీపాద తీర్థం చేత, కరస్పర్శ చేత, కరుణాకటాక్షముల చేత, మధురవాక్కుల చేత ఉద్ధరింపబడిన వారు ఎందరో ఉన్నారు. వారి జీవిత గమనంలోని కొన్ని సంఘటనలను తెలుసుకుందాము.

స్వార్థంతో వక్రమార్గంలో నడిచే కొందరికి జగదాచార్యుల కర్తవ్యనిష్ట గిట్టలేదు. అర్చకులై ఉండి కూడా ఘోర ఆపదను తలపెట్టి విష తీర్థాన్ని ఇచ్చారు. విషమిశ్రిత తీర్థాన్ని స్వీకరించినా కూడా వారికి. ప్రమాదం కలగలేదు. మరొకసారి భర్త ఆజ్ఞతో ఒక బ్రాహ్మణ గృహిణి విషం కలిపిన భిక్షను ఇయ్యటానికి సిద్ధపడింది. ఆమె తత్తర పాటును గమనించిన ఉడయవర్లు సూక్ష్మగ్రాహులై ఆ భిక్షను కావేరి లో విసర్జించారు.

చిన్ననాడే అసూయపరుడైన గురువుగారి చేత ప్రయాణంలో నట్టడవిలో వదిలివేయబడ్డారు. వరదరాజ పెరుమాళ్ళ అనుగ్రహంతో తిరిగి శ్రీకంచిని చేరుకున్నారు. ఒక రాజకుమార్తె పైగల బ్రహ్మరాక్షసి శ్రీరామానుజాచార్యులకు లొంగి వెళ్ళిపోవటం, వేదమంత్రాలకు వారు చెప్పే దివ్య అర్థాలను విని జీర్ణించుకోలేక, యాదవప్రకాశుడు ఒక ప్రయాణాన్ని ఏర్పాటు చేసి పెద్ద కీకారణ్యంలో శ్రీరామానుజాచార్యులను ఒంటరిగా వదిలి వేశాడు. చెంచు దంపతుల రూపంలో(మిగతా 10 వ పేజీలో)

# “ రక్షించ కున్ననూ రక్షకులు ఎవ్వరూ ”

సర్వ రక్షకుడు జగన్నాథుడైనా ఈ లీలా విభూతి లో (ఈ లోకంలో) అర్చామూర్తి రూపాలైన భగవన్ మూర్తులను కాపాడు కోవలసిన అవసరం మనదే! భగవత్ శక్తికి మూల కందాలైన దేవాలయాలను రక్షించవలసిన బాధ్యత సమాజానిది, ప్రభుత్వానికి కూడా! భూమి మీద ఉత్పత్తయ్యే విద్యుత్ శక్తిని ప్రజోపయోగంగా చేయడానికి ఎన్నో వ్యవస్థలను ఏర్పాటు చేసుకుంటాం! సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించి జాగరూకతతో వ్యవహరిస్తాం! అలాంటిది సర్వజగత్తుకు కారణభూతం, ఆధారభూతమైన భగవత్ శక్తి నిలయాలను కాపాడుకోవటం, ఆరాధించటం మన కర్తవ్యం. భారతదేశ చరిత్రలో ఆధ్యాత్మిక సంపన్నత ఎంతగా ఉందో ఆ సంస్కృతిని కాపాడుకోవటానికి ఎన్నో ఒడి దుడుకులను ఎదుర్కొంటున్న స్థితిగతులు ఉన్నాయి. వైదిక మతం లోనే సిద్ధాంత విభేదాలు, అధికారికఅహంకారాలు, అవైదిక మతాల రాచరిక దుశ్చర్యలు ఇలా ఎన్నో మన చరిత్రపుటల్లో కనిపిస్తాయి. నిరూపణగా విధ్వంస దేవాలయ భగవన్ మూర్తుల చిహ్నాలు కూడా దర్శనమిస్తాయి. వేద సంస్కృతికి భౌతిక రూపం మన దివ్య దేశాలు, పుణ్యక్షేత్రాలు అయితే! ఆచరణ రూపం సంస్కృతి సంప్రదాయాలు జీవన విధానాలు. సంఘం అంటే ఒకే ప్రయోజనం కల కొందరి సమూహమైతే, సమాజం అంటే అనేక ప్రయోజనాలు, లక్ష్యాలు గల అందరి సమూహము. సంఘాన్ని సమాజాన్ని కూడా ఏక తాటిపై నడిపించగ కలిగేది దేవాలయమే! ఆధునికత అసంస్కృతి పెరిగి పోతున్న నేటి కాలంలో దేవాలయ వ్యవస్థ మరింత పటిష్ఠం కావాలి. అటువంటి గొప్ప ఆధ్యాత్మిక నిధిని కాపలా కాసి, కాపాడి తర తరాలకు అందించారు. “రక్షించ కున్ననూ రక్షకులు ఎవ్వరూ రామచంద్రా” అని శరణాగతి చేస్తూనే వారి సుఖాలను ప్రాణాలను త్యాగం చేశారు. కంచర్ల గోపన్న భద్రాచల క్షేత్రాన్ని నిర్మించి కాపాడి శ్రీరామదాసుగా చరిత్రలో నిలిచారు.



భగవదనుగ్రహం మన పెద్దల ధైర్యం! భగవద్ విశ్వాసం వారి ఆయుధం! వేదాంత జ్ఞానం వారి పరాక్రమం! భావితరాలపై వారికున్న వాత్సల్యం సమాజ హితాన్ని కోరే సౌశీల్యం! వారి విజయానికి కారణాలు. భగవదనుగ్రహమును మనకు అందించే దివ్య దేశ పవిత్రతను, అర్చా మూర్తులను, ఆరాధనా వైభవాలను మన పూర్వీకులు పరిరక్షించారు. ఆ చరిత్రను మనము తెలుసుకోవాలి. ఆ మహనీయులను మనము ఆరాధించాలి!. కర్తవ్య స్ఫూర్తితో నడుచుకోవాలి. అనేక శాస్త్ర సారాలకు, వైదిక రహస్యాలకు నిర్మాణ నిలయాలు మన

శ్రీమతి సముద్రాల శారద

దేవాలయాలు. ప్రాచీనుల విజ్ఞాన నిధిని నిక్షిప్తం చేసిన పారమార్థిక పెన్నిధి మన సంస్కృతి. ఈ రెండింటిని మనకనుగ్రహించిన పూర్వాచార్యులను పెద్దలు ప్రమేయ, ప్రమాణ రక్షకులుగా సంప్రదాయంలో గౌరవిస్తారు. ప్రమేయం అంటే వేదవేద్యుడు అయిన భగవంతుడు, భగవత్ ప్రాప్తి మార్గం! ప్రమాణం అంటే “వేదాత్ శాస్త్రం పరం నాస్తి” అని ఆ భగవత్ తత్వాన్ని మనకు దర్శింప చేసిన వేదానికి యథార్థ జ్ఞానాన్ని అందించే సంప్రదాయ గ్రంథ రాశి. అర్చామూర్తి అయిన భగవంతున్ని కాపాడి సాంప్రదాయ గ్రంథ రాశిని తమ శ్రీ సూక్తుల ద్వారా విస్తారం కావించారు. వారి కైంకర్యానికి గుర్తుగా ఆయా దివ్యదేశాలలో వారి పేరుతో ఇప్పటికీ కొన్ని సేవలు జరుగుతాయి ఆ విశేషాలు కూడా మనకు ఆరాధనా ఆర్తిని, కర్తవ్య స్ఫూర్తిని కలిగిస్తాయి. పెద్దల శ్రీ సూక్తుల ఆధారంగా కొన్ని వృత్తాంతాలను తెలుసుకుందాం!

శ్రీ పిళ్ళై లోకాచార్యుల శ్రీ సూక్తులు శ్రీ సాంప్రదాయ రహస్య నిధులు. వీరు నంబి ళ్ళై శిష్యులైన వడక్కు తిరువీధి పిళ్ళైల తనయులు. దివ్యప్రబంధ నాలాయిర (4000) పాశురాలకు వ్యాఖ్యానాలు అందించిన వ్యాఖ్యాన శిఖామణి. పెరియవచ్చాన్పిళ్ళై, నంబిళ్ళై వంటి వారి సుశిక్షణలో సర్వజ్ఞులు అయినారు. పూర్వాచార్యుల, ఆళ్వారుల శ్రీ సూక్తుల సారంగా సాంప్రదాయ ఉపదేశ గ్రంథాలుగా అష్టాదశ రహస్య గ్రంధాలను అనుగ్రహించారు. అవి శ్రీ సిద్ధాంతామృతానికి పట్టుకొమ్మలుగా ప్రసిద్ధి చెందాయి. శ్రీరంగ నివాసులై నైష్ఠిక బ్రహ్మచారులుగా వీరు జీవించారు. **(మిగతా 12 వ పేజీలో)**

# అక్షయ తృతీయ శుభప్రదం

# సింహాచల చందనోత్సవమ్

వైశాఖ శుద్ధ తదియ నాడు అక్షయ తృతీయ పర్వదినం గా ప్రసిద్ధి. అక్షయ తృతీయ రోజును గొప్ప పర్వదినంగా భావిస్తారు క్షీరసాగర మధనం తరువాత లక్ష్మీ దేవిని శ్రీమన్నారాయణుడు వరించిన రోజుగా, అక్షయమైన సుభిక్షమైన కృతయుగం ప్రారంభ దినంగా, కుబేరుని సంపదలకు అధిపతిగా నియమించిన రోజుగా, ప్రహ్లాదుని నరసింహ స్వామి అనుగ్రహించిన రోజుగా ఇలా ఎన్నో శుభాలకు మూలంగా అక్షయ తృతీయను గురించి పురాణాల్లో చెప్పబడింది. లక్ష్మీదేవికి సంబధించిన అక్షయ తృతీయ నోములు. కూడా ఆచరిస్తారు.



అక్షయ తృతీయ రోజు సింహాచల క్షేత్రంలో అత్యంత వైభవంగా నిజ రూప దర్శనం, చందనోత్సవం జరుపుతారు. భూదేవి రక్షణకై వరాహమూర్తిగా హిరణ్యాక్షుణ్ణి, భక్త ప్రహ్లాదుని రక్షణకై నరసింహమూర్తిగా అవతరించి హిరణ్యకశిపుణ్ణి శ్రీ మహావిష్ణువు సంహరించాడు. ప్రహ్లాదుని కోరికపై సింహాచల మందు వరాహ నృసింహునిగా వెలసినట్లుగా స్థల పురాణము పాదాల వరకు భూమిలో ఉండి వరాహముఖంతో అవతరించి వెలసిన స్వామి తరువాత కాలంలో పురూరవ మహారాజును అనుగ్రహించి ఆలయ నిర్మాణ కైంకర్యాన్ని చేయించుకున్నాడు.

"యః కరోతి తృతీయా యాం కృష్ణం చందన భూషితం

వైశాఖస్య సితే పక్షే సయాత్యచ్యుత మందిరం" అనగా ఎవరైతే వైశాఖ శుద్ధ తదియ రోజున కృష్ణ భగవానుని (మహావిష్ణువుకు) చందన భూషితం చేస్తారో వారికి విష్ణు లోక ప్రాప్తి కలుగుతుంది అని భావం. ఆ విధంగా పురూరవ మహారాజు చేత చందనోత్సవం జరిపించబడింది. నాటినుండి సింహాచల స్వామికి ప్రతి అక్షయ తృతీయ రోజున వైభవంగా చందనోత్సవం జరుపుతారు.



## ఉగాది పురస్కారాలు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శోభకృత్ నామ సంవత్సర ఉగాది రోజున ఉగాది పురస్కారాలతో దేవాలయ అర్చకులను, పండితులను శ్రీమాన్ శ్రీ గోవర్ధనగిరి మధుసూధనాచార్యులు గారు, శ్రీ కోదండ రామాలయం, గోదావరిఖని గారు, మరియు శ్రీమాన్ శ్రీ గోవర్ధనగిరి జగన్నాథాచార్యులు, గోదావరిఖని గారిని సత్కరించింది



## రాష్ట్రపతి నిలయంలో పాలెపు రాజేశ్వరశర్మ పంచాంగ పఠనం




ధర్మపురి, మార్చి 22: ఉగాది పర్వదినం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆహ్వానం మేరకు బొల్లారం రాష్ట్రపతి నిలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సమక్షంలో శోభకృత్ నామసంవత్సర పంచాంగ పఠనం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురికి చెందిన ప్రముఖ జ్యోతిష్యవాస్తు, బ్రహ్మశ్రీ పాలెపు రాజేశ్వరశర్మ సిద్ధాంతి పంచాంగ పఠనం చేశారు. కేంద్రమంత్రి నుంచి సన్మానం అందుకున్నారు

# శ్రీపతి స్తుతి

# సుభాషితం
## మంచి మాట

శ్రియై నమః! శ్రీధరాయ నమః!



హర్యష్టకం

(గత సంచిక తరువాయి)

ఋగ్వేదోథ యజుర్వేదః,
సామవేదో ప్యథర్వణః।
అధీతస్తేన యేనోక్తం
హరి రిత్యక్షర ద్వయమ్॥

ప్రతి పదార్ధము: యేన = ఎవని చేత హరిః ఇతి = హరి అని, అక్షరద్వయం = రెండు అక్షరములు, ఉక్తం = చెప్పబడుతుందో తేన = అతని చేత, ఋగ్వేదః = ఋగ్వేదము, అథ= మరియు, యజుర్వేదః = యజుర్వేదము, సామవేదః = సామవేదము, అథర్వణః = అథర్వ వేదము, అపి= కూడా అధీతః = చదువబడినది అగును.

తాత్పర్యము: వేదము అంటే తెలుపునది అని అర్ధము. మనలనందరను కర్మానుగుణంగా పుట్టించి, కష్టసుఖాలు అనుభవింప జేసి, శరీరాన్ని విడిచి పెట్టి మరొక జన్మకలుగునట్లు చేసే శ్రీమన్నారాయణుడు మన ఇంద్రియములచే తెలుసుకో బడడు.. కర్మేంద్రియములు 5, జ్ఞానేంద్రియములు 5, మనస్సు అంతరింద్రియము. ఈ 11 ఇంద్రియములకు గూడా గోచరుడు కాడు. ఆయన స్వరూప, రూప, గుణాదులను తెలుపాలి. అంటే వేదమే ప్రమాణము. ఆ వేదాలు ప్రసిద్ధంగా 4 వున్నవి.

వేదాలు భగవంతున్ని తెలుపడమే కాక జీవులను, వాళ్ళు చేయవలసిన కర్మలను, సుఖదుఃఖములను, అవి కలుగ కుండా వుండాలంటే ఏమి చెయ్యాలి? ఏమి చేయగూడదు ? శాశ్వతమైన ఆనందం ఎవరిస్తారు? అందుకై మనం ఏంచెయ్యాలో మొదలైన అన్నివిషయాలు వేదాలలో వున్నవి.

"ఋగ్వేదంలో పరమాత్మ సృష్టి క్రమము, యజుర్వేదంలో ఆయన సర్వవ్యాపకత్వము సామవేదంలో పరమాత్మను పొందుటకై జపించాల్సిన అష్టాక్షరి మంత్ర స్వరూపము. అథర్వవేదంలో అష్టాక్షరిలోని ప్రణవము యొక్క ప్రభావము, ఉపనిషత్తులలో ఆ మంత్రోచ్చారణ వలన ఏం ఫలితము కలుగుతుందో సమగ్రంగా చెప్పబడింది. నారాయణ ఉపనిషత్తులో అట్టి 4 వేదాలను 6 అంగములతో పఠించినచో గొప్ప ఫలితం వుంటుంది. ఐతే అవి పఠించడం అంత సులభం కాదు. చాల శ్రమ కలుగుతుంది. అంత ఫలితం మనకు 'హరి' అనే రెండక్షరములు అంటే చాలు. మనకు సులభంగా లభించును.

శ్రీమాన్ అమరవాది వేంకటనరసింహాచార్యులు

అశ్వమేధై ర్మహా యజ్ఞై
నరమేధై స్తథైవ చ।
ఇష్టం స్యాత్తేన యేనోక్తం
హరి రిత్యక్షర ద్వయమ్॥

ప్రతి పదార్ధము: యేన = ఎవని చేత 'హరిః ఇతి' = హరి అని, అక్షరద్వయం = రెండు అక్షరములు, ఉక్తం = చెప్పబడిందో, తేన = అతని చేత, మహాయజ్ఞైః = మహాయజ్ఞము అనేటువంటి, అశ్వమేధైః = అశ్వమేధముల చేత, తథా+ఏవ, చ = అట్లే, నరమేధైః = నరమేధముల చేత, ఇష్టం స్యాత్ = యజ్ఞము చేయబడినది అగును.

తాత్పర్యము: లోకంలో అశ్వమేధాది మహాయజ్ఞములు చేస్తే స్వర్గాదిపుణ్యలోకాలు సిద్ధిస్తవి. ఈ లోకంలో బ్రతికినంత కాలము సుఖం కలుగుతుంది. అంతే గాక అట్టి మహాయజ్ఞాలను ఫలము కావాలని కోరకుండా భగవంతునికి ప్రేమగలగాలని చేసినట్లైతే అతనికి ప్రేమ గలిగి మనకు ఏవి కావాలో అవన్ని ఇచ్చి చివరకు తన దగ్గరకు చేర్చుకొని మళ్ళీ జన్మ రాకుండా ఎల్లప్పుడు సుఖాన్ని ఇస్తుంటారని వేద, ఇతిహాస, పురాణ, ధర్మ శాస్త్రాదులు చెప్పుచున్నవి. కాని అవి మనకు అంత సులభంకావు. ఈ కలియుగంలో శాస్త్ర బద్ధంగా చేయడం అసాధ్యము. మరైతే మనకు ఆ ఫలితాలు ఎట్లు వస్తవి ? అంటే 'హరి' అంటే అంత ఫలితము మన చేతికి అందుతుంది.

మరికొన్ని మంచి విషయాలు వచ్చే సంచికలో...

# విరోధి పరిహారణ

(6వ పేజీ తరువాయి) శ్రీకంచిపెరుమాళ్ తయారు అనుగ్రహించి కాపాడారు. కానీ చివరికి తల్లిగారి ఆజ్ఞతో యాదవప్రకాశుడు గోవింద దాసుడనే నామాన్ని స్వీకరించి శిష్యులయిన రామానుజాచార్యులకే శిష్యులైనారు.

వేల మంది జైనులు వారి అమృతవాక్సుధకు దాసోహం అయినారు. పరమ భక్తుడు సింహగిరి కృష్ణమార్య కవి పరుష వాగ్ధాటిని మానిపించి దిద్దుబాటు చేశారు. స్త్రీ నయన సౌందర్యారాధకుడయిన ధనుర్దాసును పుండరీకాక్షుడైన పెరియ పెరుమాళ్ నేత్ర సౌందర్యానికి దాసుని గావించారు. సర్వ శాస్త్ర పారంగతులు. జ్ఞాన ప్రకర్షు లైన యజ్ఞమూర్తి అను మహా పండితునితో సిద్ధాంత చర్చకు ఉడయవర్లు ఉపక్రమించారు. 17 రోజులు నిరాటంకంగా సిద్ధాంత చర్చలు జరిగాయి. ఆ సంధర్భంలో జగదాచార్యులకు కొంత సంకోచం కలిగింది. భగవత్ శరణాగతి చేస్తూ అవ్యాహత మైన. యధార్థమైన శ్రీ సిద్ధాంతాన్ని నీవే కాపాడమని ప్రార్థించారు. అప్పుడు సిద్ధాంత రత్న దృఢత్వ నిరూపణానికే సరియగు విద్వాంసునితో వాదం కల్పించానని భగవంతుడు సూచన చేశాడట! మరునాడు పండిత సభలో ఒకే మాటతో జ్ఞాన మూర్తులైన యజ్ఞమూర్తి తానోడి యతి రాజుల పాదపద్మములపై పడి శరణువేడారు. 'అరుళాళ పెరుమాళెంబెరుమానార్' అను నామం స్వీకరించి, ఉపదేశం పొంది త్రిదండాన్ని ధరించారు.

యతిరాజులు తన భక్తురాలు అగు పరుత్తిక్కొల్లి నాచ్చియార్ ను రక్షించారు. శ్రీపాద తీర్థప్రసాదాలు ఇచ్చి ఆమెను మోహించిన వర్తకుని పరివర్తనం గావించారు. ఆనాటి చోళరాజు క్రిమి కంఠుని వంటి దుష్ట రాజుల చేష్టలను కూడా వారు అధిగమించారు. నాలూరాన్ అను మంత్రి సలహాతో శ్రీరామానుజాచార్యులను బంధించి శిక్షించదలచిన చోళ రాజు యొక్క వికృతమైన శిక్షల నుండి తప్పించుకున్నారు. సుదీర్ఘకాలం శ్రీరంగ క్షేత్రాన్ని వదిలి మేల్కోటలో నివసించారు. మేల్కోట నివాస సమయంలో కూడా వ్యయ ప్రయాసల కోర్చి ఢిల్లీ నవాబుల వద్ద నుండి సంపత్ కుమార పెరుమాళ్లను భక్తితో తెచ్చి తిరునారాయణా పురమందు ప్రతిష్ఠింప చేశారు. తిరుమలలో జగదాచార్యులు చేసిన ఉద్ధరణ జగద్విఖ్యాతము. ఎక్కడ ఉన్నా సంస్కరణ, సమాజ ఉద్ధరణ లక్ష్యంగా జీవితాన్ని కొనసాగించారు. రామానుజాచార్యులు మృదు హృదయులు. మధుర వాక్ ధురీణులు. వారు వివేకం, సర్వజ్ఞత్వం, భగవద్భక్తి ఇటువంటి కళ్యాణ గుణాలతో విరోధి విషయాల పరిహారణం గావించారు. భక్తుల అడ్డంకులు తొలగించారు. విరోధి పరిహార మార్గాలను తెలిపే శ్రీ సూక్తులను అనుగ్రహించారు.

# నెలవారి పంచాంగమ్

(4వ పేజీ తరువాయి)



తుల : ఈనెలయందు అనుకూలంగా లేదు. చేయు వృత్తివ్యాపారాలు అన్నిరంగాలవారికి అనుకూలత ఉండదు. ధైర్యం కోల్పోవుదురు. అశాంతి, అకాలభోజనం, త్రిప్పుట, నేత్ర శిరోపీడలు.



వృశ్చికం: ఈనెలలో గ్రహసంచారం అనుకూలంగా ఉన్నందున అన్నిరంగాలు వారికి చేయువృత్తి వ్యాపారములు రాణించును. ఆదాయం బాగుండును. ఆరోగ్యం బాగుంటుంది. కుటుంబము సుఖ సంతోషాలతో నిండి యుండును.



ధనుస్సు: ఈనెలలో అనుకూలంగా ఉన్నందున అన్ని రంగాల వారికి చేయువృత్తివ్యాపారాలు అనుకూలించును. ఆరోగ్యం బాగుండును. ఆర్థికంగా చాలా అనుకూలత. ప్రతీవిషయంలోనూ మీదే పై చేయిగా ఉండును. ప్రయాణాలు కలిసివచ్చును. సంఘంలో ఉన్నతస్థితి కలుగును.



మకరం: ఈ నెలలో గ్రహసంచారం అనుకూలంగా ఉండుటచే అన్నిరంగాల వారికి చేయు వృత్తివ్యాపారాలందు లాభించును. వ్యవహారాలు అనుకూలించును. ఆదాయంనకు లోటుండదు. ఆరోగ్యం బాగుండును. సమస్యలు పరిష్కారమగును.



కుంభం: ఈనెల యందు గ్రహసంచారం అనుకూలంగానే ఉన్నందున చేయు వృత్తి వ్యాపారములందు అనుకూలం, ఆదాయం బాగుండును. కాని ఖర్చులు అధికంగా ఉండును. లోపల భయాందోళనలు హెచ్చును. బంధుమిత్రులు సహాయం లభించును. సంతానసౌఖ్యం.



మీనం: ఈ నెల మిశ్రమ ఫలితాలు. చేయువృత్తి_వ్యాపారాలు అన్నిరంగాలవారికి అనుకూలము. ఆరోగ్యం బాగుంటుంది. ఆర్థిక వ్యవహారాలు కలిసి వచ్చును. కొన్ని సమస్యలు తీరును.

★

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు



శ్రీమతి తిరుమల నీరజ

పలికెడిది భాగవత మట!
పలికించెడి వాడు రామభద్రుండట! నే
పలికిన భవహర మగు నట!
పలికెద వేరొండు గాథ పలుకగ నేలా?

అన్నారు మహా భక్త కవి బమ్మెర పోతన గారు. అంతే కాదు,

ఒనరన్ నన్నయ తిక్కనాది కవు లీ యుర్విం పురాణావళుల్
తెనుగుం జేయుచు మత్పురాకృత శుభాధిక్యంబు దానెట్టిదో
తెనుగుం జేయరు మున్ను భాగవతమున్ దీనిం తెనింగించి నా
జననంబున్ సఫలంబు జేసెద పునర్జన్మంబు లేకుండగన్

అని కూడా అన్నారు.

ఈ పద్యాలలో విశేష మేమిటంటే - శ్రీరామచంద్రుడు పోతన గారికి ధ్యానంలో కనిపించి శ్రీకృష్ణ గాథలు రాయమనటం ఒకటి. రెండవది పోతన గారు తనకు పునర్జన్మ లేకుండా ఉండటం కోసం భాగవతాన్ని చెప్పబూనటం. ప్రారంభ పద్యాన్ని కూడా ఆయన "శ్రీకైవల్య పదంబు జేరుటకునై చింతించెదన్" అనే మొదలు పెట్టారు.



అటువంటి భాగవతాన్ని ఎవరు చదివినా, విన్నా, చెప్పినా, ఎవరి చేత నైనా చదివించినా మోక్షమే అని సాక్షాత్తుగా వ్యాసుల వారి పుత్రుడు శుక బ్రహ్మ పరీక్షి న్మహారాజుతో చెబుతాడు. ఎక్కడా ఆవు పాలు పితికినంత సమయమైనా ఆగని శుక మహర్షి, భాగవతం వినిపించటం కొరకే పరీక్షిత్తు వద్ద వారం రోజులు ఉండడం అత్యాశ్చర్యకరం! అందుకనే శ్రీమద్ భాగవతం విశేష ఖ్యాతిని ఆర్జించుకొన్నది.

భాగవతం అంటేనే భక్తి ఉప్పొంగి పోతుంది. భగవద్భక్తులనే భాగవతులు అంటారు. వారి గాథలు తెలుసుకోవడం అంటే ఎవరి కైనా ఆనందమే! శ్రీమన్నారాయణుని అవతార విశేషాలు ఎన్నో భాగవతం మనకు తెలియచేస్తుంది. శ్రీమన్నారాయణుని అవతారాలు అంటే మనకు తెలిసినవి దశావతారాలే. కానీ ఇంకా కొన్ని అవతారాలు ఉన్నాయి అంటే ఆశ్చర్యమూ, ఆనందమూ కలుగుతాయి. వాటిని గురించి తెలుసు కుందాం. అవన్నీ లీలావతారాలే.

హిరణ్యాక్షుడు అనే దానవుడు తన బలాతిశయంతో భూమి నంతటినీ ఒక చాప చుట్టినట్లుగా చుట్టేసి తీసుకు పోయాడు. అప్పుడు శ్రీమహావిష్ణువు తన ఆకృతి నుంచే యజ్ఞశరీరంతో కోరలున్న వరాహంగా రూపం ధరించాడు. ఆ రాక్షసుణ్ని తన దంతాలతో పట్టి సంహరించాడు. ఇది యజ్ఞ వరాహ అవతారం.

ఇక రెండవది సుయజ్ఞావతారం. స్వాయంభువ మనువు కుమార్తె ఆకూతికీ, రుచి ప్రజాపతికీ పుట్టిన వాడు సుయజ్ఞుడు. మంచి ప్రవర్తన వల్ల ఇతన్ని తాత ఐన మనువు 'శ్రీహరి' అని పిలిచాడు. ఆ తర్వాత అతడు శ్రీహరిగా అవతరించాడు.

మూడవది కపిల మహర్షి అవతారం. కర్దమ ప్రజాపతికీ, దేవహూతికీ జన్మించిన వాడు కపిలుడు. సాంఖ్య యోగాన్ని తన తల్లికి బోధించి, ముక్తి మార్గాన్ని ఆమెకు దర్శింప చేశాడు కపిలుడు.

నాలుగవ అవతారం దత్తాత్రేయ అవతారం. మునులలో మేటి ఐన అత్రి మహామునికి శ్రీపతి దత్తాత్రేయుడుగా పుట్టాడు.

ఐదవది సనకాదుల అవతారం. బ్రహ్మ దేవుని పుత్రు లైన సనకుడు, సనందనుడు, సనత్కుమారుడు, సనత్సుజాతుడు - వీరందరినీ సనకాదులు లేదా సనక సనందనాదులు అంటారు. నలుగురుగా బయటికి కనిపించినా నిజానికి వీరందరూ ఒక్కరే!

ఆరవ అవతారంలో నరుడు, నారాయణుడు అనే ఇద్దరుగా అవతరించాడు పరమాత్మ. దక్ష ప్రజాపతి కుమార్తె మూర్తి, ధర్ముడు వీరి తల్లిదండ్రులు. వీరిద్దరూ బదరికావనానికి వెళ్లి తపస్సులో మునిగిపోయారు.

ఆ తర్వాతిది ఏడవది ధ్రువ అవతారం. బాల్యం లోనే తల్లి మాటను అనుసరించి, శ్రీహరిని గురించి తపస్సు చేసి నక్షత్రమండలంలో స్థానం సంపాదించుకున్న భక్తుడు. ఇతని పేరిటనే ఆ నక్షత్ర మండలానికి ధ్రువ మండలం అనే ఖ్యాతి కలిగింది

(సశేషం)

# " రక్షించ కున్ననూ రక్షకులు ఎవ్వరూ "

(7 వ పేజీ తరువాయి)

వేదాంత సూక్ష్మాలకు వక్రార్థాలు రాకుండా సిద్ధాంత గ్రంథాలు రచించి ప్రమాణ రక్షకులు అయినారు. మహమ్మదీయ రాజులచేత దేవాలయ విధ్వంసాలు జరిగినప్పుడు శ్రీరంగ క్షేత్రానికి కూడా ఆపద వచ్చింది. పెరుమాళ్లకు అడ్డ గోడ కట్టించి, నంబెరుమాళ్లను( ఉత్సవమూర్తి) అరణ్య మార్గం గుండా తానే స్వయంగా తప్పించారు శ్రీ పిళ్ళై లోకాచార్యులు. ఆ ప్రయత్నంలో మధురై వద్ద జ్యోతిష్కుడి ప్రాంతంలో శ్రీ పిళ్ళై లోకాచార్యులు పరమపదించారు అని చరిత్ర వైభవం. ఆ విధంగా ప్రమేయ రక్షకులుగా వారిని పెద్దలు స్తుతిస్తారు. పరమపదించిన సమయంలో కూడా తన తరవాత ఆచార్యులుగా సాంప్రదాయ రక్షకులుగా తిరువాయ్ మొళి పెళ్లైకి శ్రీ సూక్తులు బోధించమని తన శిష్యులను ఏర్పాటు చేశారు. ఎన్నోసార్లు ఎంతోమంది పూర్వాచార్యులు శ్రీరంగ పెరుమాళ్ళ వైభవాన్ని జాగ్రత్తగా కాపాడుకున్నారు. శ్రీ భగవద్ రామానుజాచార్యులు ఆ ప్రయత్నంలోనే శ్రీ రంగాన్ని విడిచి అన్య నివాసం చేశారు.

శ్రీ పిళ్ళై లోకాచార్యుల తర్వాతి ఆచార్యులు శ్రీ తిరువాయ్ మొళి ప్పిళ్ళై. వీరికి దివ్యప్రబంధ మందు ప్రీతి కలిగి ఆచార్యులను అర్థించి అధ్యయనం చేశారు. శ్రీ నమ్మాళ్వార్ లపై ఎంతో భక్తి కలవారు. వీరి కృషి వలన ఆల్వార్ తిరునగరి యందలి యెంబెరుమానార్ల, (శ్రీరామానుజాచార్యుల) నమ్మాళ్వారుల దివ్య దేవాలయ వైభవాలను మనం నేడు దర్శించగల్గుతున్నాము. మహమ్మదీయుల ఆలయాల విధ్వంస కాలంలో శ్రీ రంగ ఉత్సవ పెరుమాళ్ నంబెరుమాళ్లను రక్షించడానికి చాలా కాలంగా అనేక ప్రదేశాలలో (జ్యోతిష్కుడి, తిరుమా లిరుంచోలై, కోజికోడ్, తిరుక్కణంబి, తిరునారాయణపురం (మేల్కోట) చంద్రగిరి అడవులు తిరుమల, అళగియమనవాలం, శ్రీరంగం దగ్గర మొదలగు ప్రదేశాల్లో ) వేంచేపు చేశారు. ఆ సందర్భంగా తిరుక్కణాంబి సమీపంలోని కోళి కోడ్ ప్రాంతంలో ఉన్న సమయంలో నంబెరు మాళ్లతో శ్రీ నమ్మాళ్వార్ మూర్తి కూడా అక్కడే ఉంచబడింది. నంబెరుమాళ్లను శ్రీరంగానికి తీసుకుని వెళ్లగా సర్వాలంకారాలు గల నమ్మాళ్వార్ మూర్తిని ఒక కర్ర పెట్టెలో ఉంచి లోయలో భద్రపరచారు. ఆ మూర్తిని తిరిగి లోయలో నుంచి తీసే సమయంలో తిరువాయ్ మొళి పిళ్ళై వారు ఎంతో కృషి చేశారు. అప్పుడు ఒక శ్రీ వైష్ణవ శిఖామణి కందాడై తోళప్పర్ అనువారు అభ్యర్థించి ఆ లోయలోకి తాడు సహాయంతో దిగి నమ్మాళ్వార్ ల మూర్తి ని పైకి పంపి, తాను పైకిఎక్కే సమయంలో తాడు తెగి జారిపడి వారు పరమపదించారు. వారి ఎనలేని భక్తికి గుర్తుగా ఆల్వార్ తోళప్పర్ అను నామాన్ని ఇచ్చి నమ్మాళ్వార్ తిరుమంజనంలో వీరి వంశస్థులకు "ఆల్వార్ తోళప్పర్ వీరిశై" అను మర్యాదను అనుసరింప చేసే ఏర్పాటు చేశారు.

తరువాత నవాబుల దగ్గర ఉండే రంగనాథ మాణిక్య అను దేవదాసి తాను ప్రాణ త్యాగం చేసి శ్రీరంగానికి నవాబు పీడ వదిలించింది. నవాబుల వద్ద పనిచేసిన. సింగప్పిరాన్ అను నియోగి బ్రాహ్మణుడు శ్రీరంగానికి పునర్వైభవం కలిగించాడట! ఉత్సవ ఆరాధనల్లో "శ్రీరంగనాథ మాణిక్య తాళుక్క అరుళ్ పార్" అని విన్నవిస్తారట! అలాగే ప్రసిద్ధ చిదంబర క్షేత్రంలోని గోవింద రాజ పెరుమాళ్ తొలగించబడగా భగవద్ రామానుజాచార్యులచే తిరుపతిలో ప్రతిష్ఠింప చేయబడినట్లుగా చరిత్ర.

అలాగే శ్రీ సంప్రదాయానికి, ఆధ్యాత్మికతకు, దైవీ శక్తికి ఆలవాలమైన శ్రీరంగ క్షేత్రం పై ఎన్నోసార్లు దాడులు జరిగినట్లుగా చరిత్రలో ఉంది. 14వ శతాబ్దంలో జరిగిన దాడిలో ఆనాటి పెద్దలు శ్రీరంగనాథ పెరుమాళ్లను కాపాడుకోవడానికి స్వామిని పల్లకిపై మూసుకొని అడ్డదారుల్లో తిరుమలను చేరుకున్నారు. కొండపై శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో దక్షిణ మంటపం లో విడిది చేశారట! ఇప్పటికీ ఆ మంటపానికి రంగ మంటపంగా పేరు ప్రసిద్ధి ఉంది.

అలాగే ప్రసిద్ధ సింహాచల స్థల చరిత్ర లో కూడా పెరుమాళ్ళ మూర్తిని కాపాడుకున్న వృత్తాంతం తెలుపబడింది. ఇలా ఎన్నో దివ్యదేశాలలో పుణ్యక్షేత్రాలలో దేవాలయాలను అర్చా మూర్తులను కాపాడారు మన పెద్దలు. ఆధ్యాత్మిక కట్టడాలకు పునర్ వైభవాన్ని తీసుకొని వచ్చారు. ఆత్మోజ్జీవన లక్ష్యంతో వారు జీవించారు. తరువాతి తరాల వారందరినీ ఉజ్జీవింప చేయడానికి తమ జీవితాలను అర్పించారు. ఒక కృషి ఫలాన్ని తర్వాతి తరాలు అందుకున్నప్పుడు ఆ కృషి కర్తలను గుర్తించాలి గౌరవించాలి. ఇది కనీస ధర్మం. అమూల్యమైన సాంప్రదాయ సంపద కాపాడి మనకందించిన మహనీయుల చరిత్రలు తెలుసుకున్నప్పుడు మన కళ్ళు చెమర్చక మానవు. మూడు, నాలుగు వృత్తాంతాలు కాకుండా ఎన్నో చరిత్ర సత్యాలను మనం తెలుసుకోవలసిన ఆవశ్యకత ఎంతో ఉంది.

★

# జ్యోతిర్జ్ఞానమ్

## శ్రీమాన్ శ్రీ నంబి వేణు గోపాలాచార్య కౌశిక



**శ్రీసన్నిధానం పాఠకులు మీ జ్యోతిష్య శాస్త్ర సందేహాలను ప్రశ్నగా మాకు పంపండి, పరిష్కారాలను పొందండి! ఈ విజ్ఞానామృతాన్ని మీరూ ఆస్వాదించండి!!**

**(గత సంచిక తరువాయి)**

మూడవది వర్ణ వాస్తు. వర్ణం అంటే రంగులు. మనుషులు ఎన్ని రంగులలో వున్నారో, భూమి అన్ని రంగులలో వున్నది. నలుపు రంగు భూమి వుంది, ఎరుపు రంగు భూమి వుంది, తెలుపు రంగును పోలిన భూమి వుంది, పసుపు రంగు భూములు వున్నాయి. ఇలా ఆయా నక్షత్రాల రాశుల ప్రకారంగా ఏవ్యక్తికి, ఏ రంగు భూమి అయితే బాగుంటుంది అనేటువంటిది నిర్ణయించేది వర్ణ వాస్తు. నాలుగవది గణిత వాస్తు. ఒక గృహాన్ని గాని, మండపాన్ని గాని, ఆలయాన్ని గాని నిర్మాణం చేయాలంటే దానికి వెడల్పు ఎంత, పొడవు ఎంత, పొడవుకు తగిన వెడల్పు ఎలా ఉండాలి ? అనేది. భారతంలో అద్భుతమైన మయసభ నిర్మాణంలో... మయుడు మయసభ నిర్మాణం చేసేటప్పుడు పదివేల జానల వెడల్పు, పదివేల జానల పొడవు పెట్టాడు. కారణం ప్రశ్నిస్తే, దానికి గణిత విధానాన్ని చెప్పి, ఇది మిత్రులకు మైత్రిని పెంచుతుంది. శత్రువులకు భయంకరమైనది అని చెపుతాడు.

ఐదవది పథక వాస్తు. పథకము అంటే ఎటు ఎత్తు ఉండాలి, ఎటు పల్లం ఉండాలి, ఏ గది ఎంత వైశాల్యం ఉండాలి. ఏ దిశలో వుండే గది పెద్దగా ఉండాలి. ఏ దిశలో వుండే గదికి పెద్దగా ద్వారం ఉండాలి. ఏ దిశలో వుండే గదికి చిన్నగా లోతుగా ఉండాలి. ఇది చెప్పేది పథకం. ఆరవది ప్రాకార వాస్తు. ప్రహరీ, ప్ర అంటే భరించలేని దుఃఖాలను, కష్టాలను చెపుతుంది వాస్తు శాస్త్ర భాషలో. మనము ఎంత చక్కగా గృహనిర్మాణం చేసుకొన్నా, ఇతరుల యొక్క గృహనిర్మాణాల ప్రభావం కూడా మన గృహం పైన ఉంటుంది అని శాస్త్రం చెపుతుంది. అందుకే దానికి చుట్టూ ప్రహరీ గోడ, ఏ దిశలో పెట్టే గోడ ఎంత ఎత్తు ఉండాలి ఎంత వెడల్పు ఉండాలి, ఎంత బరువు ఉండాలి. ఏ దిశలో వుండే గోడ బరువు తక్కువ ఉండాలి, ఎత్తు తక్కువ ఉండాలి అని నిర్ణయించి చెప్పేటటువంటిది ప్రాకార వాస్తు. తరువాత ద్వార వాస్తు. ద్వారం నుండే స్నేహితులు, పెద్దలు, బంధువులు వస్తారు, ఆ ద్వారంనుండే చోరులు వచ్చే అవకాశం వుంటుంది కనుక ఏ దిశలో ఏ ద్వారాన్ని, ఎంత దూరంలో, గోడకు ఎన్ని అంగుళాలు, ఎన్ని అడుగుల దూరం లో పెట్టాలి అని నిర్ణయించేది శాస్త్రం నిర్ణయం చేయడం ద్వారా సహజమైన ఉత్తరాయణ, దక్షిణాయన కాలంలో చక్కనైన గాలి వెలుతురు రావటానికి ద్వారాలు ఏ రకంగా ఉపయోగపడతాయి అనే విషయాన్ని శాస్త్రంలో మనకు నిర్దేశించారు.



అలంకార వాస్తు. ఇంటీరియల్ డెకరేషన్ అని ఇపుడు చెప్పుకుంటాం. ఏ దిశలో ఎలాంటి బొమ్మలు ఉండాలి, చిత్రపటాలు ఉండాలి. ఏ దిశలో ఎలాంటి అలంకార వస్తువులు పెట్టుకోవచ్చు, తద్వారా మానసికమైన ఉల్లాసం, విజ్ఞానాన్ని, మేథా సంపత్తిని పెంచేటటువంటిది ఈ అలంకార వాస్తు.

తరువాత మంత్రం వాస్తు. అన్నిరకాలుగా సమృద్ధిగా ఇంట్లో వున్నా మనకు దుష్ట సంకల్పాలు కలిగి కష్టాలు మనమే తెచ్చుకొనేటటువంటి ప్రయత్నం రాకుండా కాపాడేటటువంటిది, దైవం ద్వారా వచ్చే, దైవాన్ని ఆరాధించే పద్ధతులు ఆయా మంత్రాలూ, ఆ శబ్దాల ద్వారా వచ్చే వైబ్రేషన్స్ ద్వారా ఆ ఇంట్లో పాజిటివ్ వాతావరణం ఎలా ఉంటుంది అని చెప్పేది. దీనిలో రకరకాల యంత్రాలు గాని, చక్కనైన పాత్రల అలంకారాలు గాని, వాటి ఆకారాలు గాని పెట్టుకోనేటివంటి విధానాన్ని తెలుపుతుంది.


యోగ వాస్తు. మనిషి యొక్క నక్షత్రాన్ని, జన్మ జాతకాన్ని బట్టి, ఏ జాతకానికి **(మిగతా 15 వ పేజీలో)**

# స్వార్థం-సమాజ హితం

## బాలవిజ్ఞానం

దానం చేయటం అనేది ఒక సంస్కృతి మాత్రమే కాదు. అది పరోపకారానికి సమాజ హితానికి మూలమైనది. ఆ విషయాన్ని తెలియచేసే ఒక కథను తెలుసుకుందాం!

సుధీష్ణుడు అనే రాజు వారి నాన్నగారి హిత బోధనలను మనసులో పెట్టుకొని తదనుగుణంగా రాజ్యపాలనం చేసేవాడు. సుధీష్ణుని తండ్రి దీర్ఘ రోగంతో బాధపడుతూ మంచాన పడి ఉన్నా అతని బుద్ధి, మనసు చక్కగా పనిచేస్తూ ఉండేవి. వేద శాస్త్ర ధర్మాలు ఎరిగిన వాడు కనుక ధర్మ సూక్ష్మాలు కుమారునికి బోధించేవాడు. ఒకనాడు ఆయన కుమారునికి దానం గురించి బోధించాడు. దానగుణాన్ని ప్రజలందరికీ అలవాటు చేయు''మని చెప్పాడు. సుధీష్ణుడు తండ్రి మాటను శిరసావహిస్తాడు కనుక ఆస్థానంలో పండితులను మేధావులను పిలిపించి ఏం చేద్దామని సలహా అడిగాడు. వారు సరే నన్నారు. రాజు ఒక్కడే సమాజ క్షేమం గురించి బెంగ పడవలసిన అవసరం లేదు. సమాజమంతా సమాజ హితానికి పాటుపడుతుంది. అని మేధావుల,పండితుల చర్చల ద్వారా సారాన్ని అర్థం చేసుకున్నాడు. ఇక దానిని అమలుపరచడానికి కొన్ని పథకాలను ఏర్పాటు చేసుకున్నాడు. ముందుగా కొందరు సంపన్నులు, వ్యాపారస్తులు, రాజవంశీయులను పిలిచి సమావేశాలు ఏర్పాటు చేశాడు. ఉత్తమ దాన సేవలు అందించిన వారికి బిరుదులు సన్మానాలు ప్రకటించాడు. ఈ కార్య నిర్వహణకు ఒక కార్యవర్గాన్ని కూడా ఏర్పాటు చేశాడు. దేశమంతా దానాల సందడి పెరిగిపోయింది. అన్నదానాలు, వస్తు దానాలు, వస్త్ర దానాలు ఇత్యాదులు పెరిగిపోయి రాజు మెప్పు కోసం దానాలు చేయడం ప్రారంభించారు. ప్రదర్శన కొరకు దానం చేయడం రాజు గారి ఖాతాలో తాము చేసే దానాలు చిట్టాలు చేరడానికి ధనవంతులు తాపత్రయపడడం పెరిగిపోయింది. సామాన్యులు వారి పనులు మానేసి ఉచితంగా దొరికే వాటి కోసం పరుగులు తీయడం మాట్లాడుకోవడం మొదలైంది. ఒక నెల రోజుల తర్వాత రాజ్యంలో జరిగిన మార్పులు చూసి రాజు తల పట్టుకున్నాడు. తిరిగి సుధీష్ణ మహారాజు వాళ్ళ నాన్నగారి వద్దకు వెళ్లి పరిష్కారాన్ని అడిగాడు. దానం అంటే ప్రతిఫలం కోరకుండా ఇచ్చేది.కానీ ప్రతి ఒక్కరూ తాము గెలవాలని దానాలను చేస్తున్నారు. పనులు మానేసి జనులు ఉచితంగా దొరికే దానికి పరుగులు పెడుతున్నారు. ప్రజల్లో ధార్మికతను పెంపొందించాలి. కానీ దానాలను ప్రోత్సహించే పద్ధతి ఇది కాదు. గుప్త దానమే నిజమైన దానం అని చెప్పాడు. సుధీష్ణుడు సరేనని ఆ కార్యక్రమాలను ఆపివేశాడు. గుప్త దానాలను ప్రోత్సహించడం ప్రారంభించాడు. పుణ్యం కోసం దానం చేయాలని ప్రచారం చేశాడు. అలా కొద్ది రోజులు గడిచిన తర్వాత మళ్లీ సమాచారాన్ని తెప్పించుకొని చూశాడు. ఈసారి దానధర్మాలు తగ్గిపోయాయి. నిజంగా రహస్యంగా దానం చేసే వారి సమాచారం సరిగ్గా అందటం లేదు. చేయని వాళ్ళు చేసినట్టుగా చెప్తున్నారు. చేసిన వారి సమాచారము దొరకటం లేదు. ఇక ఇది కూడా లాభం లేదని భావించి, ప్రజల అభిప్రాయం ఎలా ఉందో తెలుసుకోవటానికి అజ్ఞాతంగా కొందరు ముఖ్యులతో కలిసి దేశ సంచారం చేయడం ప్రారంభించాడు. ఒక ఊరిలో జరుగుతున్న కార్యక్రమాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. కొందరు యువకులు కలిసి "సుధేష్ణ ధర్మ మార్గం'' అని పేరు పెట్టుకుని ఒక ఉచిత అన్న సత్రాన్ని ఏర్పాటు చేశారు. ఒక పాఠశాలను ఏర్పాటు చేశారు. అక్కడ ఎంతోమంది నిరుపేదలకు ఉచితంగా ఆహారం ఇస్తున్నారు. ఉచితంగా విద్య నేర్పిస్తున్నారు. మరొక ఊరిలో రాజు గారి పేరుతో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు. ఆ సేవలకు అవసరమైన ధనాన్ని వస్తువులను సేకరించి కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నారు. ఇలా కొన్ని పల్లెలలో పట్టణాలలో ఇలాంటి సంస్థల ద్వారా సమాజ సేవలు చేయటం గుర్తించాడు. సమాజ హితానికి సమాజమే చేసే సేవలకు సంతోషించాడు. వివరాలను అడిగి తెలుసుకున్నాడు. వెంటనే తండ్రి వద్దకు వెళ్లి విషయాన్ని వివరించాడు. సుధీష్ణుని తండ్రి'' ఇప్పుడు నీ కర్తవ్యం ఏమిటి? నీవు ఏమి తెలుసుకున్నావు?'' అని ప్రశ్నించాడు. సుధీష్ణుడు ఇలా చెప్పాడు'' అన్నింటికన్నా గొప్ప దానం వారికి ఏది అవసరమో దానిని ఇవ్వడమే!. ఉచితంగా దొరికితే అవసరం లేకపోయినా ఎవరైనా తీసుకోవటానికి ఇష్టపడతారు. కానీ అలా ఇస్తే అది అపాత్ర దానమే అవుతుంది.దానాన్ని గుప్తంగా కాకుండా వెల్లడిగా ఇవ్వాలి. అలా ఇచ్చినప్పుడే అది సమాజంలో మరికొందరికి ప్రేరణ కలిగిస్తుంది. స్వార్థం లేకుండా పరహిత బుద్ధితో చేసే సేవలకు ప్రభుత్వం కూడా సహకరించాలి. అందరికీ ప్రోత్సాహాన్ని కలిగించాలి.'' అని సుధీష్ణుడు పరిపక్వతతో చెప్పిన సమాధానానికి అతని తండ్రి ఎంతో సంతోషించాడు. ఇక చక్కని రాజ్యపాలన కుమారుడు ఈయగలడని భావించాడు.



# జ్యోతిర్విజ్ఞానం

(13 వ పేజీ తరువాయి)

ఏ ప్రక్కలో, అది వంటశాల గాని, పూజ స్థానం గాని, కూర్చుండే స్థానం గాని, ఆసనం ఎత్తు పొడవులు నిర్ణయించేటటువంటిది యోగ వాస్తు. ఈ పది వాస్తుల యొక్క సారాంశమే సిద్ధ వాస్తు. సిద్ధ వాస్తు అంటే, సంకల్పించిన మాత్రంలో కార్యక్రమాలు అన్ని పరిపూర్ణంగా సులభంగా, సంతోషంగా జరగాలి అనే భావము. ఇవన్నీ కలయిక సరిగా ఉంటే అనగా స్థలము గాని, స్థానము గాని, వర్ణం గాని, గణితం గాని, పతకం గాని ప్రాకారం గాని, ద్వారం గాని, అలంకారం గాని, మంత్రం గాని, యోగం గాని సరిఅయిన విధంగా ఉంటే ఆ ఇంట్లో వుండే వాళ్ళు నిత్యకల్యాణం పచ్చ తోరణంగా వుంటారు. ప్రధానం ఏమిటంటే మానవుని ఆయుః ప్రమాణాన్ని అనుసరించి ఈ నిర్మాణాలు గాని, వస్తు నిర్మాణం గాని ఉపయోగకరమైన వస్తువుల యొక్క వాడుక ఉంటుంది. కారణం ఏమిటి? ఉదాహరణ గ్లాసులో నీళ్ళ పోసుకొని తాగితే అరనిమిషంలో తాగగలుగుతారు.. అదే పళ్లెం లో పోసుకొంటే దానికి పది నిముషాలు పడుతుంది. కాలం చాల విలువైంది. కనుక సకాలంలో సక్రమంగా సహజీవనాన్ని కొనసాగిస్తూ ఆనందాన్ని పెంచి, పంచుకొనేటటువంటి యొక్క విధానాన్ని చెప్పింది వాస్తు శాస్త్రం. ఇలాగే జ్యోతిష్యశాస్త్రంలో వుండే భాగాలలో వాస్తు, ఖగోళం, భూగోళం, జాతక భాగం, ముహూర్తభాగం ఇవన్నీ కూడా నిర్దేశించబడ్డాయి. వీటిని మన భారతీయులు ప్రాచీనకాలం నుంచి అనుసరించారు. సకల శాస్త్రాలకు పుట్టినిల్లు అయిన భారత దేశం నించే ఎన్నెన్నో వైజ్ఞానికంగా విషయాల్ని ఇతర దేశాలు పొందుతున్నాయి. ప్రధానం ఏమిటీ అంటే ఇక్కడనే ఇన్ని ఉండాల్సిన అవసరం ఏమిటంటే శాస్త్రాల్లో ప్రపంచానికి రాజధాని భారత దేశం. ఇక్కడ వుండే ఋషులు అందరు కూడా వాళ్ళు శోధించి అనేక విషయాల్ని సాధించి మనకందించారు. దివ్యమైనటువంటి ఈ విషయాలను మన శ్రీసన్నిధానం అనే పత్రిక ద్వారా మెల్లమెల్లగా అంచెలంచెలుగా వివరముగా తెలుసుకొందాము అని మీ అందరికి విజ్ఞాపన చేస్తూ వున్నాను.

**మరికొన్ని విషయాలు వచ్చే సంచికలో...**

## వైభవంగా సుదర్శనచక్ర, జయ విజయ ప్రతిష్ట

మానకొండూరు మండలం లోని స్థానిక పురాతనమైన వెంకటేశ్వర స్వామి దేవాలయంలో 16 మార్చి నుండి మూడు రోజుల ఉత్సవాలు ప్రముఖ జ్యోతిష్య వాస్తు ఆగమ శాస్త్ర పండితులు నమిలకొండ రమణాచార్య ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పండితులు, స్థానిక ఎమ్మెల్యే రసమయి బాలకృష్ణ, సర్పంచ్ పృథ్వీరాజు, ఆలయ కమిటీ అధ్యక్షులు వెంకటస్వామి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





కరీంనగర్ జిల్ల పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఉగాది పురస్కారాలలో ఉత్తమ ఆధ్యాత్మిక సేవాపరులు అను పురస్కారం స్వీకరించిన జ్యోతిష్య వాస్తు, ఆగమ శాస్త్ర పండితులు నమిలకొండ రమణాచార్య.




## ఉగాది పురస్కారాలు

భద్రాచలం అనంతాళ్వాన్ పీఠము (ప్రాజెక్టు) వారు ఆచార్యులు, శ్వాస్ రాష్ట్ర ఆగమ సలహామండలి సభ్యులు, షట్ శాస్త్ర కోవిదులు శ్రీ ఉ.వే. శ్రీమాన్ చిలుక మర్రి శ్రీవర్ధనాచార్యుల వారికి శ్రీసంప్రదాయ రత్న అవార్డును ప్రదానం చేశారు. యావత్తు ఇందూర్ జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేశారు.



# ఆధ్యాత్మిక వార్తలు

## శోభకృత్ నామ సంవత్సర ఉగాది ఉత్సవాలు

శ్రీవైష్ణవ సేవా సంఘం, ట్రస్ట్, తెలంగాణ



శ్రీవైష్ణవ సేవ సంఘం, సేవా ట్రస్ట్, తెలంగాణ ఆధ్వర్యంలో శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది ఉత్సవాలు 19-03-2023 ఆదివారం రోజున శ్రీవైష్ణవ సదనం, యల్.బి.నగర్ లో జరిగినాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సలహదారు, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు శ్రీమాన్ డా॥ కె.వి. రమణాచార్యులు గారు, మరియు ఆత్మీయ గౌరవ అతిధిగా మాజీ కేంద్ర మంత్రివర్యులు, తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ



అధ్యక్షులు శ్రీమాన్ డా॥ సముద్రాల వేణుగోపాలాచార్యులు గారు పాల్గొన్నారు. ఇందులో భాగంగా పలువురికి ఉగాది పురస్కారాలతో అందజేశారు.

శ్రీమాన్ ఆచి నర్సింహాచార్య స్మారక పాంచరాత్రాగమ పురస్కారము : ఉ.వే.ప్ర. శ్రీమాన్ పి.టి.జి. కిషోర్ స్వామి గారు, యాజ్ఞిక పీఠం, హైదరాబాద్, శ్రీమాన్ డా హన్మంతరావు ఉమాదేవి గారల అర్చక పురస్కారము : ఉ.వే.ప్ర. శ్రీమాన్



నల్లదీగ శ్రీనివాసాచార్యులు గారు, శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం, సంతోష నగర్, హైదరాబాద్. వేదపండితులు: శ్రీమాన్ శ్రీ సందుగుల లక్ష్మణాచార్యులు గారు, జగిత్యాల్, ఉభయ వేదాంత పండిత పురస్కారము : ఉ.వే. ప్ర. శ్రీమాన్



ఆచి వేంకట పాండురంగాచార్యులు గారు, హైదరాబాద్

శ్రీమాన్ సముద్రాల శ్రీనివాసాచార్యుల స్మారక సంస్కృత పండిత పురస్కారము : ఉ.వే. ప్ర. శ్రీమాన్ దరూరి రామానుజాచార్యులు గారు, యాదాద్రి

ధార్మిక సాహిత్య పురస్కారము : ఉ.వే. ప్ర. శ్రీమాన్ ముడుంబై వరదాచార్యులు గారు, వరంగల్. ప్రతియేడు జరుపుకునే ఈ వేడుకను తాము సకుటుంబముగా అధిక సంఖ్యలో విచ్చేసి కార్యక్రమమును జయప్రద మొనర్చినందులకు కార్యవర్గ కమిటీ అభినందనలు తెలియజేసింది. ఈ కార్యక్రమ నిర్వాహకులు, కార్యవర్గ సభ్యులు శ్రీమాన్ కండ్లకుంట యాదగిరాచార్యులు, చైర్మన్, శ్రీమాన్ చిలుకమర్రి లక్ష్మీనాథాచార్యులు కార్యదర్శి, శ్రీమాన్ శృంగారం తిరువేంగళాచార్యులు అధ్యక్షులు, శ్రీమాన్ సేనాపతి మోహన్, ప్రధాన కార్యదర్శి, శ్రీవైష్ణవ సేవాసంఘం తెలంగాణ, సభ్యులు ఈ కార్యక్రమం నిర్వహించారు.

## 21 వ శ్రీ అష్టలక్ష్మి యాగము భాగ్యనగరంలో

శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి మంగళాశాసనములతో..లోక కళ్యాణార్థం, శ్రీపాంచరాత్ర ఆగమోక్తానుసారంగా, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రాంతాల్లో 20 శ్రీ అష్టలక్ష్మి యాగాలు దిగ్విజయంగా పూర్తిచేసుకొని, 21 వ శ్రీ అష్టలక్ష్మి యాగము మన భాగ్యనగరంలో జరిపిస్తున్న శుభసందర్భంగా, శ్రీమాన్ పీతాంబరం రఘునాథాచార్య స్వామి వారు చేస్తున్న ధర్మ ప్రచారానికి కృతజ్ఞతలు తెలియచేస్తూ శ్వాస్ కార్యవర్గ సభ్యులు సమర్పించిన కృతజ్ఞాంజలి.

